క్లుప్తంగా

ఆన్‌లైన్ డిస్కౌంట్‌లకు మోసపోవద్దు



హసన్‌పర్తి: ఆన్‌లైన్ డిస్కౌంట్‌లకు ఆకర్షితులై తెలియని సైట్‌ల ద్వారా వస్తువులు కొనుగోలు చేసి మోసపోవద్దని సీఐ గోపీ అన్నారు. జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. వినియోగదారుల సమాచార కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ఆన్‌లైన్ మార్కెటింగ్‌లో జరుగుతున్న మోసాలను వినియోగదారుల కౌన్సిల్ ద్వారా అరికట్టవచ్చన్నారు. ఎక్కువ శాతం నగదు ద్వారానే కొనుగోలు చేయాలని సూచించారు. వినియోగదారుల సమాచార కేంద్రం హసన్‌పర్తి చైర్మన్ అనుమాండ్ల విద్యాసాగర్, ఎస్సైలు అశోక్, సమాచార కేంద్రం సభ్యులు వెంకటేశ్వర కుమార్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంక్షేమ సంఘం డైరెక్టర్ల ఎన్నిక ఏకగ్రీవం

కాజీపేట: జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం డైరెక్టర్ల పదవులకు ఆదివారం జరిగిన ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాదిరెడ్డి రవీందర్‌రెడ్డి, మేరుగు హనుమారెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం మూడో వంతు నిర్వహించే డైరెక్టర్ల ఎన్నికల్లో కుందూరు కరుణాకర్ రెడ్డి, చాడ సునిల్‌రెడ్డి, డాక్టర్ పోలుసాని మధుకర్‌రెడ్డి, బిల్లా రాంరెడ్డి, న్యాలాకొండ భాస్కర్ రావు, తాటిపల్లి జనార్ధన్ రెడ్డి, ఎం.కొండల్ రెడ్డి, రావు అమరేందర్‌రెడ్డి, కె.రాంరెడ్డి, కె.ప్రకాష్ చందర్ రెడ్డి, అజిత్‌రెడ్డిలు ఎన్నికయ్యారు.

వితంతువులు, వృద్ధులకు చీరల పంపిణీ



కాశిబుగ్గ : క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని డాక్టర్ వలబోజు మోహన్‌రావు ఆదివారం వృద్ధులు, వితంతువులకు చీరలు పంపిణీ చేశారు. క్రిస్టియన్ కాలనీలో జరిగిన కార్యక్రమానికి టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరై అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ మోహన్‌రావు సేవలను కొనియాడారు. కాంగ్రెస్ నాయకులు లాజర్, ప్రభాకర్, రవి, రతీష్, నాగరాజు, చంద్రమౌళి, యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంతో ఇద్దరికి చూపు

ఎంజీఎం : నేత్రదానంతో ఇద్దరి అంధులకు చూపును ప్రసాదించవచ్చని తెలంగాణ శరీర నేత్ర అవయవదాతల అసోసియేషన్ అధ్యక్షుడు కొంద్రు మల్లారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వరంగల్ చౌరస్తా సమీపంలోని యోగి గురుప్రసాద్ అపార్ట్‌మెంట్ నివాసి సాకర్ బన్‌ఘోషర్(94) అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్రదానం చేశారు. నేత్రాలను ఎల్వీ ప్రసాద్ కంటి సేకరణ నిపుణులు రాజు ప్రసాద్ ద్వారా నేత్ర సేకరణ చేశారు. నేత్రదానానికి అంగీకరించిన ఆమె కుటుంబ సభ్యులు కుమారుడు కశాల్‌చంద్, గోషర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పబ్లిక్‌గార్డెన్‌లో చిత్రలేఖనం పోటీలు



హన్మకొండ : సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సుమారు 120 మంది చిన్నారులు పాల్గొని పర్యావరణ పరిరక్షణ–మొక్కల ప్రాధాన్యత, పండుగలు–విశేషాలు అంశాలపై గీసిన చిత్రాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బహుమతులను అందజేశారు. అకాడమీ డైరెక్టర్ సాగంటి మంజుల మాట్లాడుతూ చిన్నారుల్లో దాగివున్న చిత్రకళకు పదును పెట్టాలన్న లక్ష్యంతో ప్రతి నెలకోసారి పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్, డాక్టర్ సతీష్, రాజ్‌కుమార్, శ్యాంసుందర్, అనిత, జ్యోతి, కోమలత, కాసమ్మ, సంజన, సాయికిరణ్ పాల్గొన్నారు.

అమ్మవారి షాడో ఆర్ట్



హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళి దేవాలయంలో ఆదివారం చందన అనే విద్యార్థిని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం చందన అమ్మవారి షాడో ఆర్ట్ వేసి ఈఓ శేషుభారతికి అందజేశారు.

పెరకవాడలో కోతుల స్వైరవిహారం

- బయటకు రావాలంటేనే భయపడుతున్న ప్రజలు
- పట్టించుకోని బల్దియా అధికారులు



పెరకవాడలో రోడ్డు, ఇంటి ఎదుట తిష్టవేసిన కోతులు

ఖిలా వరంగల్ : నగరంలోని 33వ డివిజన్ రైల్వేగేట్ పెరకవాడలో కోతుల గుంపు స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్డుపై ఇంటి ముంగిట్లో వందలాది కోతులు గుంపుగా ఏర్పడి సంచరిస్తున్నాయి. వానర సైన్యాన్ని చూసి ప్రజలు హడలిపోతున్నారు. రోడ్లపై కోతులు తిష్టవేసి చేతిలో సంచి, కవర్లతో నడిస్తే వ్యక్తులపై ఆకస్మికంగా దాడి చేసి కవర్లు ఎత్తుకెళ్తున్నాయి. ఈ కాలనీలో ఇప్పటికే పదుల సంఖ్యలో కోతుల దాడికి గురయ్యారు. కాలనీవాసులు బయటకు రావాలంటే జంకుతున్నారు. కోతులను పట్టి అడవుల్లో వదిలేస్తున్నామని బల్దియా అధికారుల గొప్పలు చెబుతున్నారే తప్ప వాటి నివారణకు చర్యలు లేవని ఆరోపిస్తున్నారు. ఇటీవల స్థానికులు నగర పాలక సంస్థ కమిషనర్‌ను కలిసి గ్రీవెన్‌సెల్‌లో ఫిర్యాదు చేయగా ఒక్కపూట జవాన్లు బోన్లు ఏర్పాటు చేసి ఒక్క కోతినైనా పట్టుకోలేకపోయారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి కోతులను పట్టేందుకు ప్రత్యే క చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత శ్రీనివాస్ కోరుతున్నారు.

ఎంపీల సస్పెన్షన్ అప్రజాస్వామికం



హెడ్ పోస్టాఫీస్ జంక్షన్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

వరంగల్ చౌరస్తా : పార్లమెంటులో ఇటీవల జరిగిన అప్రజాస్వామిక బీజేపీ విధానాలను తీవ్రంగా ఖండించాలని, ప్రతిపక్ష పార్టీల ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని ప్రజాస్వామికవాదులంతా నిలదీయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హెడ్‌పోస్టాఫీస్ జంక్షన్‌లో ముక్కెర రామస్వామి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం వరంగల్ జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యురాలు నలిగంటి రత్నమాల మాట్లాడుతూ 141 మంది ప్రతిపక్ష పార్టీల ఎంపీలను సస్పెండ్ చేశారని, వెంటనే ఎత్తివేయాలన్నారు. పార్లమెంటులో భద్రత వైఫల్యంపై ప్రధాని మోడీ బాధ్యత వహించాలన్నారు. భారత రాజ్యాంగానికి ప్రజాస్వామ్య, లౌకిక విధానా లకు వ్యతిరేకంగా బిజెపి తీసుకున్న విధానాలతో పార్లమెంట్‌లో తప్పుపడితే ప్రతిపక్ష పార్టీల ఎంపీలను సస్పెన్షన్ చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అరూరి కుమార్, వలదాసు దుర్గయ్య, నాయకులు ప్రశాంత్, కట్టప్ప, జుబేదా బేగం, మహేష్, ఉదయ్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



పారేది నీరా.. ప్లాస్టికా !

ఈ ఫొటో చూస్తే ఈ మురికి కాల్వలో పారేది నీరా? ప్లాస్టికా అన్నట్లు ఉంది. కాజీపేట 62వ డివిజన్ సోమిడి ప్రధాన రహదారి పక్కనున్న మురికి కాలువ కాల్వను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. దీని ద్వారా మురుగునీరు పేరుకపోయి దోమలకు నిలయంగా మారింది. గ్రేటర్ అధికారులు వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. – కాజీపేట

క్రీస్తు బోధనలు ప్రపంచశాంతికి బాటలు



హసన్‌పర్తి: దుస్తులు పంపిణీ చేస్తున్న రమేశ్

హసన్‌పర్తి: క్రీస్తు బోధనలు ప్రపంచశాంతికి బాటలు అని మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని హంటర్‌రోడ్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం పాస్టర్ కుటుంబాలకు దుస్తులు పంపిణీ చేశారు. అరూరి గట్టుమల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ ప్రతి ఏటా క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని పాస్టర్లకు క్రమం తప్పకుండా దుస్తులు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో అరూరి గట్టుమల్లు ట్రస్ట్ సీఈఓ రాజు, ఎంపీపీ అప్పారావు, జెడ్పీటీసీ భిక్షపతి, వర్ధన్నపేట మున్సిపల్ చైర్‌పర్సన్ అరుణ, కార్పొరేటర్లు రజిత, సునీల్, షిబా రాణి, సరోజన, కర్ణాకర్, అరుణ, పీఏసీఎస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, రమేష్, సంపత్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రజనీ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మినీ క్రిస్మస్ వేడుకలు

కాజీపేట: మండలంలోని సోమిడి శివారులో ఉన్న తాళ్ల పద్మావతి ఒలంపియాడ్ స్కూల్‌లో ఆదివారం మినీ క్రిస్మస్ వేడుకలను విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం ప్రారంభించారు. ఉపాధ్యాయుల మార్గదర్శకంలో విద్యార్థులు అందమైన పశువుల పాకను నిర్మించి క్రీస్తు జన్మవృత్తాంతంను తెలిపే బాల యేసు, మేరీమాతా, జోసెఫ్ బొమ్మలతో అందరి దృష్టిని ఆకర్శించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు తాళ్ల వంశీ, చైతన్య, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సంరక్షలో సెమీ క్రిస్మస్ వేడుకలు



హాస్పిటల్‌లో కేక్ కట్ చేస్తున్న ఎండీ దిడ్డి శ్రావణ్‌కుమార్, డైరెక్టర్లు

కాశిబుగ్గ : వరంగల్ సంరక్ష సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ దిడ్డి శ్రవణ్‌కుమార్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ అజిత్ మహమ్మద్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం సీనియర్ పాస్టర్ ఎల్లయ్య ప్రత్యేక ప్రార్థనలు చేసి క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రిస్మస్ ఎంతో సంతోషకరమైన పండుగని, హాస్పిటల్‌కు వచ్చే రోగులకు సిబ్బంది సేవానిరతితో సేవలు అందించాలని కోరారు. సిబ్బందికి యాజమాన్యం బహుమతులను అందజేశారు. వేడుకల్లో ఆర్ఎంఓ డాక్టర్ బందెల మోహన్‌రావు, డైరెక్టర్లు డాక్టర్ పోలా నటరాజ్, డాక్టర్ ఉషారాణి, డాక్టర్ లక్ష్మీదీపక్, డాక్టర్ శ్రవణ్, డాక్టర్ శ్రీనివాస్, డైటీషియన్ సరిత, సిబ్బంది విద్యాదరి, అనిల్ ఝూన్సీ, కిరణ్, జ్యోతి, గౌతమి, కృష్ణ, బాబు, నీరజ, విజయ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చదరంగ పోటీలు



పతకాలు, ట్రోఫీలతో చిన్నారులు

హన్మకొండ: కమల్ కింగ్స్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో హనుమకొండలోని టీటీడీ కల్యాణమండపంలో ఆదివారం ఉమ్మడి జిల్లా స్థాయి చదరంగ పోటీలు నిర్వహించారు. అండర్–07, 09, 11, 15 బాల బాలికలకు నిర్వహించిన పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 230 మంది క్రీడాకారులు హాజరైనట్లు నిర్వాహకుడు, అకాడమి చైర్మన్ జీ.రాంప్రసాద్ తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన పోటీల్లో బాలుర విభాగంలో జీ.అవినాష్, ఎం.ధృవాన్ష్, బీ.ఆయాన్ష్, జీ.ఆయాన్ష్, బీ. మహితేజ్ వరుసగా విజేత స్థానాల్లో నిలబడ్డారు. బాలికల విభాగంలో ఏ.శౌర్య, జీ.మాన్విత, పి షణ్ముఖి, సీహెచ్.నాగవేదశ్రీలు విజేతలుగా నిలిచారు. పోటీలకు ముఖ్య అతిథిగా వరంగల్ డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజేంద్ర హాజరై విజేతలకు నగదు పురస్కారంతో పాటు సర్టిఫికెట్లు, పతకాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్బిటర్లు అభిలాష్, సాయి, మణికంత, అనిల్, శ్రీకాంత్, ఉదయ్ పాల్గొన్నారు.

సిద్ధాపురంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

హసన్‌పర్తి: మండలంలోని సిద్ధాపురం జిల్లా పరిషత్ పాఠశాల 1999–2000 సంవత్సర విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. పూర్వ విద్యార్థులు ఒకొరినొకరు కలుసుకుని గత స్మృతులను నెమరువేసుకున్నారు. ఉపాధ్యాయులు బాబురావు, రాములు, ప్రతాప్, శంకరయ్యలను శాలువలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక



విద్యారణ్యపురి: హనుమకొండలోని జేఎన్ఎస్‌లో ఈనెల 21 నుంచి 23 వరకు జరిగిన 17 ఏళ్లలోపు గల వారికి నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ హైస్కూల్ విద్యార్థి ఆర్.శివ ఉత్తమ ప్రతిభ కనపర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం జి.వి రమణరావు ఆదివారం తెలిపారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు రాణి ఆధ్వర్యంలో శిక్షణ పొందిన శివ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన ఈ పోటీల్లో తన ప్రతిభ చాటారన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, డీఈఓ ఎండి.అబ్దుల్‌హై స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అజీజ్‌ఖాన్ చేతల మీదుగా బహుమతితో పాటు ప్రశంసలు, జ్ఞాపికను అందుకున్నారని తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీ అందజేత



హన్మకొండ: అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స చేయించుకునే ఆర్థిక స్తోమత లేని నిరుపేదకు వైద్యం చేయించుకునేందుకు సీఎం సహాయ నిధి నుంచి ఎల్‌ఓసీని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అందించారు. హనుమకొండ సమ్మయ్యనగర్‌కు చెందిన పి.రాజేష్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స నిమిత్తం చేరగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం రూ.10 లక్షలు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పారని బాధితుడి తండ్రి సత్యనారాయణ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా సీఎం సహాయ నిధి నుంచి రూ.5 లక్షలు మంజూరు చేయించి ఆ ఎల్‌ఓసీని సత్యనారాయణకు ఆదివారం హనుమకొండలో అందించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ, హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్ యాదవ్ పాల్గొన్నారు.

26 నుంచి దివ్య జీవన మహాసభలు

నయీంనగర్: 48వ దివ్య జీవన మహాసభలు ఈనెల 26, 27, 28 జనవరి 2024 యాదాద్రి (యాదగిరి గుట్ట), శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణం, వ్రత మండపం 2లో జరుగుతాయని స్వామి విష్ణుదేవానంద తెలిపారు. ఆదివారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు సభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్య జీవన సభలకు వచ్చే డెలిగేట్స్‌కు ఉచిత భోజన, వసతి ఏర్పాట్లు కల్పించబడుతాయన్నారు. కార్యక్రమంలో దివ్య జీవన సంఘం వరంగల్ శాఖ అధ్యక్షురాలు బి.విజయలక్ష్మి, ఎస్.ప్రమోద్‌కుమార్, శ్రీదేవి, సమీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'కళాశాల గుర్తింపు రద్దు చేయాలి'

హసన్‌పర్తి: భీమారంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల గుర్తింపు రద్దు చేయాలని కోరుతూ విద్యార్థి సంఘా నేతలు ఆందోళన చేపట్టారు. కళాశాల ఎదుట ఆదివారం ధర్నా జరిగింది. బీ ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్, ఎస్ ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, ఏబీ ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, ఎస్ ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్‌లు మాట్లాడారు. కళాశాలను సీజ్ చేసి విద్యార్థినులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని కోరారు.

పేదల హక్కుల సాధనకు పోరాడాలి



ఎర్రజెండా ఆవిష్కరిస్తున్న మేకల రవి

మామునూరు: పేద ప్రజల హక్కుల సాధన కోసం మరింతగా కృషి చేద్దామని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సహాయ కార్యదర్శి షేక్ బాషిమియా అన్నారు. సీపీఐ 99వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఖిలా వరంగల్ మండలం బీఆర్ అంబేద్కర్‌నగర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథులుగా వారు హాజరై అరుణ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. స్వాతంత్రం కోసం పోరాడిన ఘనత సీపీఐ దేనని చెప్పారు. కూడు,గూడు లేనటువంటి నిరుపేద ప్రజలకు అండగా ఎర్రజెండా ముందు ఉంటుందన్నారు.ఇప్పటికైనా పాలక వర్గాలు ఉన్నత వర్గాలకు ఊడిగం చేయడం మానుకొని పేద ప్రజలకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వాల పాలన కొనసాగించాలని వారు తెలిపారు. కార్యక్రమంలో దుండు లక్ష్మణ్, గన్నారపు రమేష్, ఓర్సురావు, తాళ్ళపెల్లి జాన్‌పాల్, ఎండి అక్బర్, యాకూబ్, నవంబి, విజయలక్ష్మీ, చిట్యాల సువర్ణ, చిరంజీవి, రాజు, జోసెఫ్ కుమార్, దీపిక ప్రశాంత్, ప్రభాకర్, రాజు రమేష్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీతారాం

హసన్‌పర్తి: పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సీతారాం కోరారు. భీమారంలో పెన్షనర్స్ డే వేడుకలు ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా సీనియర్ పెన్షనర్లను శాలువతో సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సీతారాం మాట్లాడుతూ పెన్షనర్ల హెల్త్‌కార్డులు అన్ని కార్పొరేట్ ఆస్పత్రిల్లో పనిచేసేలా చూడాలన్నారు. భీమారం పెన్షనర్స్ యూనిట్ అధ్యక్షుడు ఎర్రబెల్లి కమలాకర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు పెండ్యాల బ్రహ్మయ్య, కార్యదర్శి నారాయణగిరి వీరన్న, భీమారం యూనిట్ ప్రతినిధులు వెంకన్న, సదానందం, దేవరాజం, జనార్ధన్‌రావు పాల్గొన్నారు.

ఎన్పీడీసీఎల్ సీఎండీని కలిసిన సంఘాల నేతలు

హన్మకొండ: టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డిని ఆయా సంఘాల నాయకులు శనివారం రాత్రి కలిశారు. నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ భవన్‌లో సీఎండీని తెలంగాణ ఉద్యమకారుల వేదిక కన్వీనర్ ప్రొఫెసర్ వెంకటనారాయణ, సుధాకర్, పాపిరెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందించారు.